ప్రజాశక్తి

శనివారం 17 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ..

నిరసనాగ్రహం

- విశాఖ బీచ్ రోడ్డులో జూడాల భారీ ర్యాలీ
- కెజిహెచ్‌లో వైద్య సేవలు బంద్
- నిందితులకు శిక్షపడేవరకూ ఉద్యమిస్తామని హెచ్చరిక
- పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు

బీచ్ రోడ్డులో జూనియర్ వైద్యులు భారీ ర్యాలీ

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ విశాఖలో జూనియర్ వైద్యులు భగ్గుమన్నారు. శుక్రవారం ఉదయం ఆర్‌కె బీచ్ రోడ్డులో వారంతా కదంతొక్కారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. వారి నిరసనాగ్రహంతో బీచ్ రోడ్డు ప్రాంతం హోరెత్తింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన తలపెట్టిన ఈ భారీ ర్యాలీ కాళికా టెంపుల్ నుంచి పార్క్ హోటల్ వరకూ సాగింది. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వార్డులు, అత్యవసర విభాగాల్లో అందించే సేవలకు ఎవరూ హాజరవలేదు. విశాఖ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య మిగతా 2లో..

ఎన్నిక పత్రంపై సంతకం చేస్తున్న బొత్స సత్యనారాయణ

వైసిపికి ఊరట

ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నిక కావడం వైసిపి శ్రేణులకు కొంత ఊరటనిచ్చినట్లయింది. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పాడేరు, అరకు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలిచారు. మూడు ఎంపీ స్థానాల్లో అరకు వైసిపి గెలవగా, రెండు స్థానాలు కూటమి పరమయ్యాయి. ఏజెన్సీలో వైసిపి తన రాజకీయ బలాన్ని నిలబెట్టుకున్నా, మైదానంలో ఘోరంగా దెబ్బతింది. నిరుత్సాహంలో నాయకత్వం వుండడంతో పార్టీని నడపగలిగిన నాయకుడు లేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లపాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణ, స్థానిక సంస్థల్లో తమ పట్టుకోల్పోకుండా కాపాడుకోవడం మిగతా 2లో..

'ఉక్కు'పై ప్రధానితో సిఎం చంద్రబాబు మాట్లాడాలి

వార్త మెయిన్‌లో..

ఎసిఎ పాలకవర్గానికి నామినేషన్ల దాఖలు

వార్త 2లో..

నేవీ ప్రహరీ నిర్మాణ పనులు అడ్డగింత

వార్త మెయిన్‌లో..

మైనింగ్‌తో తలెత్తే నష్టాలను గ్రామస్తులకు వివరిస్తున్న డాక్టర్ బి.గంగారావు

కుసులవాడ కొండ మైనింగ్‌ను రద్దు చేయాలని..

సిపిఎం పాదయాత్ర

ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీ

వార్త మెయిన్‌లో..

నేడు పలుచోట్ల తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) మూడు, నాలుగు జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్.రవి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా జివిఎంసి టిఎస్‌ఆర్ నుంచి హైలెవెల్ రిజర్వాయర్‌కి వచ్చే ప్రధాన మంచినీటి సరఫరా 400 ఎంఎం డయా సిఐ పైపు లైను పాడైనందున దానికి మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డులోని తమిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లి వీధి, ఎయు అవుట్ గేట్ డౌన్, ఓల్డ్ సిబిఐ డౌన్, మైత్రీ నగర్, వినాయగర అపార్టుమెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్ రోడ్ సబ్ మెరైన్, ఓషన్ వ్యూ లే అవుట్ ఏరియా, చినవాల్తేర్, ఏరియా, 22వ వార్డులోని బాలాజీ నగర్, టైమ్స్ అఫ్ ఇండియా, సిద్ధార్థనగర్, 24వ వార్డులోని పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, మిగతా 2లో..

మాట్లాడుతున్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

మధ్యవర్తిత్వంతో

వ్యాజ్యాల సత్వర పరిష్కారం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

వార్త 8లో..

మొదటి పేజీ తరువాయి..

వైసిపికి ఊరట

కాస్త కష్టంగా వుంటుందని పార్టీ అధినాయకత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దించిన బొత్స సత్యనారాయణ ఎన్నిక కావడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో కొంత ఉత్సాహం నెలకొంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రధాన పార్టీల నాయకులతో బొత్సకు సామాజిక, రాజకీయ సంబంధాలున్నాయి. వైసిపిలో బొత్స నాయకత్వాన్ని స్వీకరించగలిగిన ముఖ్యులు వున్నారు. జివిఎంసి, జిల్లా పరిషత్ సమావేశాల్లో వైసిపి నుంచి చాకచక్యంగా మాట్లాడగలిగిన, ఇతర పార్టీల నాయకత్వంతో మంచి సంబంధాలు కలిగిన నాయకులెవరూ వైసిపిలో ప్రస్తుతం లేరు. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యత బొత్స ఎన్నికతో భర్తీకానుంది. అనకాపల్లి, పెందుర్తి జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీలో బొత్సతో కలిసి పనిచేశారు. వ్యాపార వ్యవహారాల్లో టిడిపి ఎమ్మెల్యేలతో మంచి సంబంధాలున్నాయి. సీనియర్ రాజకీయ నాయకుడు కావడంతో టిడిపి, జనసేన ఎమ్మెల్యేలు, ఎంపిలతో బొత్సకు పరిచయాలున్నాయి. ఇవన్నీ బలహీనపడుతుందనుకున్న వైసిపికి కొంత బలాన్ని చేకూర్చినట్లయింది. జివిఎంసి కార్పొరేటర్లు ఇకపై టిడిపి, జనసేన వైపు వెళ్లకుండా నిరోధించగలుగుతామన్న ధైర్యం ఆ పార్టీలో వ్యక్తమవుతోంది. జెడ్‌పిటిసిలు వైసిపిని వీడే పరిస్థితి ప్రస్తుతానికి లేదు.

మూడు సభలకు ఎన్నికైన బొత్స !

విశాఖ కలెక్టరేట్ : వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కొత్తగా ఒక రికార్డు సాధించారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ చట్టసభలు నాలుగు ఉండగా వాటిలో మూడింటి నుంచి ఆయన ఎన్నిక కావడమే ఆ రికార్డు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయన పార్లమెంటు సభ్యునిగా, అసెంబ్లీ సభ్యునిగా ఈసరికే పని చేశారు. ఇప్పుడు శాసనమండలి సభ్యునిగా ఎన్నిక కావడంతో మూడు సభలకు ఎన్నికైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ పదవులు గురించి చూస్తే విజయనగరం జిల్లా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు. బొబ్బిలి పార్లమెంటు స్థానానికి 1996లో కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి ఓటమి చెందారు. 1998లో మరోసారి పార్లమెంట్ మధ్యంతర ఎన్నికలు జరిగాయి అప్పుడు కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 1999లో జరిగిన పార్లమెంట్ సాధారణ ఎన్నికలలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి చట్టసభలకు ఎన్నికై పార్లమెంట్లో అడుగు పెట్టారు. ఇక 2004లో తొలిసారిగా విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2014లో ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అసెంబ్లీ సభ్యునిగా ఇది ఆయనకు తొలి ఓటమి. 2019లో ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2024లో మరోసారి వైసిపి అభ్యర్థిగా ఇదే నియోజకవర్గంలో పోటీ చేసిన ఆయన పరాజయం పాలయ్యారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థలకు జరిగిన శాసనమండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఈ విధంగా మూడు చట్టసభలకు ఆయన ఎన్నికయ్యారు. చట్టసభలకు ఎన్నిక కావడమే కాకుండా రాష్ట్ర మంత్రిగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలోనూ, ఆ తర్వాత రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి వర్గాలలోనూ ఆయన పని చేశారు. పిసిసి అధ్యక్షునిగా కూడా వ్యవహరించారు. వైసిపికి ఆయన వచ్చిన తర్వాత 2019 నుంచి 2024 వరకు వైఎస్.జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో ఆయన పలు శాఖలు నిర్వహించారు. తాజా ఎమ్మెల్సీగా ఆయన పదవీకాలం మూడు సంవత్సరాల నాలుగు మాసాల మాత్రమే ఉంటుంది.

నేడు పలుచోట్ల తాగునీటికి అంతరాయం

27వ వార్డులోని అశోక్ నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్ పార్క్ రోడ్డు, రెడ్డి హౌస్పటైల్ రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నెంబర్ 1 నుండి 6 లైన్ వరకు, అమర్ నగర్ చర్చి రోడ్డు, సిబియం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డులోని ఫాకర్స్ లేఅవుట్, కైలాసమెట్ట, రామ్ నగర్ ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది. ఆయా చోట్ల ప్రజలకు తాగునీటికి అసౌకర్యం కలగకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్లు రవి తెలిపారు.

కెనరా విద్యాజ్యోతి పథకం కింద..
ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ స్కీమ్ కింద కెనరా బ్యాంక్ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ఐదు నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆరుగురికి రూ.24 వేలు చొప్పున ఉపకారవేతనాలు అందించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ విశాఖపట్నం ఎజిఎం ఎన్.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. 11 ఏళ్లుగా ప్రతిభగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ఎప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వాల సహకారంతో ఇతర దేశాల్లో చదువుకునే వారికి విద్యా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ..

నిరసనాగ్రహం

బీచ్ రోడ్డులో తలపెట్టిన నిరసన ర్యాలీలో ఐద్వా నాయకులు

(మొదటి పేజీ తరువాయి..) సేవలపై జూడాల ఆందోళన ప్రభావం కనిపించింది. బీచ్ రోడ్డులోని నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై జరిగిన క్రూరత్వ సంఘటనలు మొత్తం వైద్య వృత్తిని కదిలించాయన్నారు. బెంగాల్‌లోని మహిళా వైద్యురాలిపై జరిగిన విషాదకరమైన, అమానవీయమైన దాడి హేయమైనదన్నారు. జూనియర్ వైద్యుల కోసం జాతీయ స్థాయిలో రక్షణ చట్టం తెచ్చేవరకూ ఆందోళన కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. జూడాలు గురువారం నుంచి అత్యవసర సేవలకూ హాజరవ్వడం లేదన్నారు. నిరసన ర్యాలీలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రియాకృష్ణవేణి, డాక్టర్ ఊహ రాపేటి, డాక్టర్ వై.రాజ్ వివేక్, డాక్టర్ కె.ఖజానా, డాక్టర్ సి.నాగ కిరణ్ కుమార్, డాక్టర్ ఎం.శిరీష, డాక్టర్ ఎస్‌కె.మొయినుద్దీన్, డాక్టర్ ఎమ్‌డి.రహీమా నస్రీన్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం కూడా వైద్య విద్యార్థుల ఆందోళనలు కొనసాగాయి. కెజిహెచ్ ఒపి గేటు నుంచి ఆంధ్ర మెడికల్ కళాశాల వరకు పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రజా సంఘాల మద్దతు

బీచ్ రోడ్డులో జూనియర్ వైద్యులు చేపట్టిన నిరసన ర్యాలీకి ఐద్వా జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ కొల్‌కతాలో జరిగిన తాజా ఘటన మరో నిర్భయ ఘటన అని పేర్కొన్నారు. అతి కిరాతకంగా దుండగులు జూనియర్ వైద్యురాలిని హత్య చేసినట్లు తెలుస్తోందన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు, హింస పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకు ఉద్దేశించిన చట్టాలు పటిష్టంగా అమలుకావడం లేదన్నారు. హంతకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జిల్లా కమిటీ సభ్యులు కె.సంతోషం, జి.మణి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతు తెలిపింది. బీచ్ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, విశాఖ జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్, నాయకులు రాజేష్, స్రవంతి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్యుల పోరాటానికి మద్దతు ప్రకటించారు.

డాబాగార్డెన్స్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జానకి, లోకేష్, లైకోన్, నాగశ్రీ పాల్గొన్నారు.

గాజువాక : దేశంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని అఖిల భారత మానవ హక్కుల సంఘం సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం గాజువాక అధ్యక్షుడు, ఏపి బిసి సెల్ చైర్మన్ జాగారపు శ్రీను అన్నారు. కొల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా పాత గాజువాక జంక్షన్, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాగరపు శ్రీను ఆధ్వర్యంలో వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు డాక్టర్ సంపత్, డాక్టర్ మోజీ కెల్విన్, వి డెంటల్ డాక్టర్స్, వందేభారత్ బ్లడ్ బ్యాంక్, సంజీవిని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, గాజువాక ఎన్జీవోస్ ప్రతినిధి సనపల రాఘవరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ సురేష్ రెడ్డి, పల్లా త్రినాథ్, కరణం బాబూరావు, సేనాపతి శ్రీను, జాన్, మెరెండా యాదవ్, సునీల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రవి, అజయ్ హేమంత్, గుర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు..

చోడవరం : స్త్రీ విముక్తి సంఘటన, పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చోడవరంలోని బీడీకాడ రోడ్డులోగల ఎస్‌సి హాస్టల్ నుండి కొత్తూరు జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ లక్ష్మీకుమారి మాట్లాడారు. పిడిఎస్‌ఒ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, ఆయా సంఘాల నాయకులు కల్పన, కుమారి రాంచరణ్, అఖిల్ పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హంతకులను శిక్షించాలి

నేడు వైద్య సేవలు బంద్
ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జయచంద్ర నాయుడు

మీడియా సమావేశంలో పాల్గొన్న ఐఎంఎ ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం దేశవ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేయనున్నట్లు ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జయచంద్రనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి విశాఖ జిల్లాలో ఐఎంఎ ఆధ్వర్యంలో శనివారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాల వివరాలను ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం జగదాంబ జంక్షన్ దగ్గరలోని డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జూనియర్ డాక్టర్లు కెజిహెచ్‌లో ఒకరోజు విధులు బహిష్కరించారని గుర్తు చేశారు. అలాగే శుక్రవారం బీచ్ రోడ్‌లో ర్యాలీ చేపట్టారన్నారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిపిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే వారు ఏ విధంగా పనిచేస్తారని ప్రశ్నించారు. ఈ ఘటన యావత్ భారత దేశ ప్రజలను ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. 36 గంటలపాటు విధి నిర్వహణలో ఉండి సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సదరు వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. హాస్పిటల్‌లో ఏ విధమైన సెక్యూరిటీ సౌకర్యం లేకపోవడం, సిసి కెమెరాలు కొరవడడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి నాయుడు మాట్లాడుతూ కొల్‌కతా సంఘటన అమానుషమైనదన్నారు. ఐఆర్‌ఐఎ అధ్యక్షులు డాక్టర్ వి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కేసును నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు. వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఐఎంఎ విశాఖ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పిజె.శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో అధిక శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. రాత్రి పూట మహిళా వైద్యులు పని చేసే ప్రదేశంలో రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరారు. కేరళ, కర్నాటక మాదిరిగా నిందితుల శిక్ష మూడేళ్ల నుంచి ఏడేళ్లకు పెంచేలా చట్ట సవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఐఎంఎ ప్రతినిధులు డాక్టర్ అవినాష్, డాక్టర్ వైఎల్ఎస్.రావు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రణీత, డాక్టర్ ధరణి పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. O.S.55/2023

Between:
Korada Bhaskara Rao ...Plaintiff
And: Chilla Sriramulu @ Sriramulu Reddy ...Defendant

To,
Chilla Sriramulu @ Sriramulu Reddy, S/o Chilla late Appala swamy, Door No: 55-12-2, MMTC Colony, Seethammadhara, Visakhapatnam.

నోటీసు

నా క్లైంట్ శ్రీ కోరాడ భాస్కర రావు వాదిగా, పై తెల్పిన కోర్ట్ వారి ఎదుట, పై నెంబర్ దావాను మీ పై అనగా చిల్ల శ్రీరాములు @ శ్రీరాములు రెడ్డి ప్రతివాదిగా మీ పై రిజిస్టర్డ్ తనఖా పత్రము సొమ్ము రాబట్టుకొనుటకు గాను, వ్యాజ్యమును వేసి వున్నారు. మీ పై కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారము మీ పై ఎన్ని మార్లు పై చిరునామాకు సమన్సు జారీ చేసినను, మీరు ప్రతిస్పందించ నందున, ఈ ప్రకటన ద్వారా మీరు **తేదీ. 6-9-2024న** పై తెల్పిన **కోర్ట్ వారి ఎదుట ఉదయం 10:30 నిమిషములకు** స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ అక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల మీ పరోక్షమున దావా పరిష్కారం కాగలదు.

నూక శ్రీరామ మూర్తి
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 9989616835

బాక్సింగ్ రజత పతక విజేతకు నగదు నజరానా

కుష్మితకు చెక్ అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన మండలంలోని చిప్పాడ గ్రామానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి వెంపాడ కుష్మితను శుక్రవారం స్థానిక సన్ స్కూల్ అధినేత కె శ్రీనివాసరావు అభినందించారు. రూ 5 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు హరియాణా, రోహతక్‌లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో కుష్మిత సత్తాచాటి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని శ్రీనివాసరావు ఆకాంక్షించి, కుష్మితను అభినందించారు.

మహా వృక్షాల పరిరక్షణే లక్ష్యంగా వృక్షా బంధన్

భారీ చెట్టుకు వృక్షాబంధన్ కడుతున్న మహిళలు, చిన్నారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : దేశవ్యాప్తంగా మహావృక్షాల పరిరక్షణే లక్ష్యంగా చిల్డ్రన్స్ మూమెంట్ ఫర్ క్లైమేట్ జస్టిస్ నేతత్వంలో అయిదు రాష్ట్రాల్లో శుక్రవారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించినట్లుసిఫా ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శశిప్రభ ప్రకటించారు. శుక్రవారం సీతమ్మధారలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా చిల్డ్రన్ మూమెంట్ ఫర్ క్లైమేట్ చేంజ్ నేతత్వంలో ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా డౌనూరులో, అనకాపల్లి జిల్లా కోటవురట్ల, ఒడిశా కోరాపుట్ జిల్లా సిమిలిగూడ, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ లో వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆగస్టు రెండో తేదీ నుంచి వృక్షాబంధన్ కార్యక్రమం నిరంతరాయంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు.. విభిన్న స్వచ్ఛంద సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా మహ వక్షాలను పరిరక్షణ బాధ్యతగా దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌అంబాసిడర్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో విత్తనాలతో కూడిన రాఖీలు తయారు చేశారని, శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకూ శుక్రవారం వాడవాడలా వృక్షాబంధన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

అనూష (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -గోపాలపట్నం : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి బుచ్చిరాజు పాలెంలో చోటుచేసుకుంది. ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. ఎన్ఎడి దరి బుచ్చిరాజుపాలెం భాష్యం స్కూల్ పక్క సందులో అత్త,ఇద్దరు పిల్లలతో అద్దింట్లో పీతాంబరం అనూష(25) నివాసముంటోంది. శుక్రవారం తెల్లవారుజామున ఫ్యాన్ హుక్కుకు చీరతోఉరివేసుకుని అనూష ఆత్మహత్యకు పాల్పడింది. డయల్ 100 కు సమాచారం అందడంతో ఎయిర్ పోలీస్‌స్టేషన్ సిఐ చక్రధర్‌రావు సిబ్బందితో ఘటనా స్థలానికచేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. రోజు మాదిరిగానే రాత్రి అందరూ పడుకున్నారని, శుక్రవారం ఉదయం 6:30గంటలకు నిద్రలేచిన అనూష; టిఫిన్ తీసుకురమ్మని తన అత్తను ఇద్దరు పిల్లలతో పంపించింది. టిఫిన్ తీసుకుని వచ్చి చూసేసరికి ఫ్యాను హుక్కుకు వేలాడుతూ కనిపించింది. అపుడే ఘటన చోటుచేసుకోవడంతో ప్రాణం ఉందేమోఅన్న ఆశతో చుట్టుపక్కల వారి సహాయంతో అనూషను కిందకు దించారు. కానీ అప్పటికే చనిపోయింది. శుక్రవారం పలాసలో శుభకార్యానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సందర్భంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. చెన్నయ్‌లో ఉంటున్న మృతురాలు అనూష భర్త వెంకటరమణ ముందురోజు రాత్రి అక్కడ బయలుదేరి, మరికొద్దిసేపట్లో ఇంటికి వస్తాడనుకున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఎలాంటి గొడవలు లేవని, పలాస వెళ్లేందుకు సిద్ధమవుతూ, తనను టిఫిన్ తెమ్మని పురమాయించి, ఇంతలో ఇలా జరుగుతుందని అనుకోలేదని అత్త అనసూయ వాపోయారు.

కాగా గదిలో సూసైడ్ నోట్ దొరికింది. అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని, అత్తకు సంబంధించిన రూ.90 వేలు అవసరాల నిమిత్తం వాడుకున్నానని, అవి తిరిగి సర్దుబాటు చేయలేకపోయానని, చెన్నై నుంచి వస్తున్న భర్తకు ఏం చెప్పాలో తెలియక గొడవ అవుతుందని భయంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొంది. తన ఇద్దరు పిల్లల్ని తన తమ్ముడు చూసుకోవాలని ఉత్తరంలో రాసి ఉంది. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పక్కన నారాయణ స్కూల్‌లో ఒకటి, ఐదో తరగతి చదువుతున్నారు. భర్త వెంకటరమణ చెన్నైలో సినీ ఫీల్డ్‌లో మేకప్ మ్యాన్‌గా పని చేస్తున్నాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్ కు తరలించారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో నేడు వైద్య సేవలు నిలిపివేత

ప్రజాశక్తి -గాజువాక: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్త పిలుపుమేరకు ఈ నెల 17న శనివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు, డిజిఎం బంగారురాజు ప్రకటనలో తెలిపారు. కంటిరోగులు, ప్రజలు గమనించాలని కోరారు. అత్యవసర సేవలు తప్ప, సాదారణ అవుట్ పేషెంట్ విభాగం పనిచేయదని సూచించారు.

ఎసిఎ పాలకవర్గానికి నామినేషన్ల దాఖలు

నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి -మధురవాడ: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) పాలకవర్గంలో ఏర్పడిన ఆరు ఖాళీ స్థానాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం పోటీ అభ్యర్థులు పిఎం పాలెంలోని వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో తమ నామినేషన్లను దాఖలు చేశారు. అధ్యక్షునిగా పోటీకి కేశినేని శివనాథ్ తరపున కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఉపాధ్యక్ష స్థానానికి పి.వెంకటప్రసాద్, సెక్రటరీగా సానా సతీష్ బాబు, జాయింట్ సెక్రటరీగా పి.విష్ణుకుమార్‌రాజు, ట్రెజరర్‌గా దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా డి.గౌరు విష్ణుతేజ్ నామినేషన్లు వేశారు. ఎసిఎ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ తరపున న్యాయవాది ఎన్.అశ్విన్‌కుమార్ పోటీ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు.

అప్పన్న ఆర్జిత సేవలు పున:ప్రారంభం

ప్రజాశక్తి -సింహాచలం : కోవిడ్ సమయంలో నిలిపివేసిన సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో అప్పన్న ఆర్జిత సేవలను ఒక్కటొక్కటిగా పునరుద్ధరిస్తున్నారు.అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు భోగమండపం వరకు భక్తులను అనుమతించి, ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాస్ ఆచార్యులు అర్చకులు సహస్రనామార్చన ప్రారంభించారు. ఇకనుంచి ప్రతిరోజూ స్వామి భోగమండపంలో ఉదయం, కల్యాణమండపంలో సాయంత్రం వేళల్లో అప్పన్న సహాస్త్రనామార్చన సేవలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి తెలిపారు.కోవిడ్ సమయంలో అప్పన్న ఆర్జిత సేవల్లో భాగంగా స్వామి అంతరాలయ దర్శనంతోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో సహస్ర నామార్చన సేవలను నిలిపేయగా, శుక్రవారం నుంచి వాటిని పున:ప్రారంభించారు.

ఎమ్మెల్యే గణబాబును కలిసిన ముస్లిములు

ముస్లిములతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేగా తన విజయానికి సహకరించిన గోపాలపట్నం మసీదు ముస్లిం మైనారిటీలు, కొత్తపాలెం మస్జీద్ ఎ నూరానియా మసీదు ముస్లిములు శుక్రవారం ఎమ్మెల్యే గణబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన వారందరికీ ఎమ్మెల్యే గణబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తేగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు బొమ్మిడి రమణ , దాడి వెంకటరమేష్, నాయకులు బొడ్డేటి విజయ్, నారిపిన్ని సత్తిరాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని గండిగుండం పంచాయతీ సత్తరువు జంక్షన్ సమీపంలో అశోక లేఔట్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు స్థానికులు గమనించి విఆర్ఎ సింహాచలానికి సమాచారం అందించగా, ఆయన విఆర్ఓ మంగరాజుకు తెలియజేశాడు. విఆర్ఓ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలను సేకరించారు. సంఘటన స్థలం చేరుకున్న స్థానిక సిఐ టివి తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్ మృతుడు ఎవరనే విషయమై ఆరా తీశారు. కాగా మృతుడు మూడురోజుల క్రితం సత్తరువు జంక్షన్‌లో సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుని వయస్సు 25-30ఏళ్లు ఉండొచ్చని, ఒంటిపై నలుపురంగు హాఫ్‌ప్యాంట్, ఆకుపచ్చని చెక్ షర్టు వేసి ఉన్నాడు. శరీరమంతా డీకంపోజ్ కావడం, ముఖం గుర్తుపట్టడానికి వీలులేనంతగా తయారవ్వడంతో మృతుడు ఎవరని గుర్తించలేకపోయారు. అయితే మోకాలు, అరికాలుపై స్వల్పగాయాలున్నట్లు అనుమానిస్తున్నారు. అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ టివి.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ గంట్యాడ సంతోష్ దర్యాప్తు చేస్తున్నారు

ఉచిత అంబులెన్స్ సర్వీస్ ప్రారంభం

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- వేపగుంట : కృష్ణానగర్‌లోనిభారత మానవ హక్కుల సంరక్షణ (ఐహెచ్‌ఆర్‌సి) ప్రధాన కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా కమిటీ చైర్మన్ రాజాన ప్రసాదరావు సారథ్యంలో జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు. సత్య రఘు ఛారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన ఉచిత అంబులెన్స్ సర్వీసును ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎంతమంది మహనీయుల త్యాగఫలాలతో సాధించిన భారత స్వాతంత్ర్యం పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. స్వేచ్ఛ, క్కులు పొందుతూనే ఇతర హక్కులను గౌరవించాలని, మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు.కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సి జిల్లా, రాష్ట్ర, జాతీయ నేతలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే పంచకర్లతో భేటీ అయిన పెందుర్తి నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రజా సమస్యల పరిష్కారం, సౌకర్యాల కల్పనే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా, వివక్షతకు తావులేకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషిచేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం సీతమ్మధారలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే పంచకర్లను పెందుర్తి ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిసి, కండువా వేసి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు.దీనిపై ఎమ్మెల్యే పంచకర్ల సానుకూలంగా స్పందించారని మండల టిడిపి నేతలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ అప్పనపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని అప్పనపాలెం, పద్మావతి నగర్ 11కెవి ఫీడర్లలో విద్యుత్ నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 17న శనివారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ జోన్ ఆపరేషన్స్ ఇఇ పి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. అప్పనపాలెం, శ్రీనివాసనగర్, పద్మావతినగర్, షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఇఇ శ్రీనివాసరావు కోరారు.

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం, పరదేశీపాలెం సబ్ స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు. రామవరం, కణమాం, యర్రవానిపాలెం ,గోరింట, బోయపాలెం, గంబీరం, కొత్త కళ్లివానిపాలెం తదితర ప్రాంతాలలో గృహ, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గంటాకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

ప్రజాశక్తి -మధురవాడ : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు అతని నివాసంలో కలిసి బ్రహ్మకుమారీలు రాఖీని కట్టి శుభాకాంక్షలు తెలిపారు.సోదరభావంతో రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలకు గంటా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంధ్యారాణి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్వహణకు వితరణ

గంటాకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు తన వంతు సాయంగా శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ అధినేత పోతిన అప్పలనాయుడు రూ.లక్ష చెక్కును వితరణగా అందించారు. పిఎం.పాలెంలో జరిగిన ఒక కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు చెక్కును అందించారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు వితరణ అందజేసిన అప్పలనాయుడును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీను, తమ్మిన శ్రీను, పోతిన రఘు, రాయన శ్రీను పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘననివాళి

నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 75వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు పులి లక్ష్మీబాయి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, బిసి నేత సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతినిస్థానిక వార్డు టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు పులి వెంకటరమణారెడ్డి, నేతలు దొమ్మేటి అప్పారావు, పట్నాల కన్నయ్య, నీలాపు సోమ రెడ్డి, కేత శంకరరావు, పెద్దాడ సోమునాయుడు పాల్గొన్నారు.

వ్యూహాత్మకంగా ముందడుగు

సదస్సులో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : పొరుగు దేశాల్లో నెలకొన్న రాజకీయ, అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి విషయాన్ని నిశితంగా గమనిస్తూ భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్, ఐడిఎస్ఎ, ఎన్ఎంఎఫ్ పూర్వ డైరెక్టర్ సి.ఉదయకుమార్ అభిప్రాయపడ్డారు.శుక్రవారం పౌర గ్రంథాల యంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో భారతదేశ విదేశాంగ విధానానికి సంబంధించి వ్యూహాత్మక కార్యాచరణపై జరిగిన సదస్సులో ఉదయభాస్కర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను చర్చిస్తూ, రాబోయే కొన్ని నెలలు అక్కడి పరిస్థితులు నిశితంగా గమనించాలన్నారు. పొరుగున చైనా రాజకీయంగా, ఆర్థికంగా సైనికపరంగా బలమైన శక్తిగా ఉందన్న విషయంగుర్తు పెట్టుకోవాలని సూచించారు. 1971 ముందున్న పరిస్థితులు బంగ్లాదేశ్ లో రాగలవా అనే విషయంలో వేచి చూడాలన్నారు. ప్రపంచంలో మూడోబలమైన శక్తిగా భారత్ అవతరించాలని అభిలషించారు పాత్రికేయుడు కె.విప్రసాద్ హిందూ మహా సముద్ర ప్రాంతంలో భారత్ ఆధిపత్యం సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్న కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

ఉక్కునగరంలో మిన్నంటిన స్వాతంత్ర్య సంబరాలు

భావితరాల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తితోనే ఉక్కు ఉద్యమం బలోపేతం : సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : భావితరాలలో, ప్రజలలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని 78వ వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి గంగారావు పిలుపునిచ్చారు. ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయం ఆవరణలో ఉక్కు అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారా ఏర్పడిన విశాఖ ఉక్కును తిరిగి అదే ప్రజా పోరాటాల ద్వారానే కాపాడుకోవడం సాధ్యమవుతుందని వివరించారు. ఆ పోరాట స్ఫూర్తిని ప్రజలలో కలిగించడానికి కళారూపాలు ప్రధాన భూమిక పోషిస్తాయని, ఇది చరిత్ర చెప్పిన నగ్న సత్యమన్నారు. ఆ దిశగా కళారూపాలు సమాయత్తం కావాలని, ప్రజలను జాగృతం, చైతన్యవంతం చేసేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జిఎం ఎం మధుసూదనరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమాన్ని భావితరాలకు పరిచయం చేస్తే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

దేశభక్తి భావాన్ని పెంపొందించేలా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

నేటితరం పిల్లలో దేశభక్తి భావాన్ని పెంపొందించడం ద్వారా సమాజాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయడంతోపాటు, కుటుంబ విలువలు, నైతికత పెరిగేందుకు దోహదపడుతుందన్నారు విద్యార్థుల్లో గల బుద్ధి వికాసానికి కళలుమరింత దోహదపడతాయని ఆయన అన్నారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసరాజు, నంది అవార్డు గ్రహీత బాలాజీ నాయక్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగడం కోసం 1280 రోజులుగా స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద కార్మికుల పోరాడుతున్నారన్నారు. స్టీల్ ఉద్యోగుల పిల్లలు దేశ విదేశాలలో అత్యంత గౌరవంగా, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా జీవిస్తున్నారంటే తల్లి లాంటి విశాఖ ఉక్కు పెట్టిన భిక్షగా మనందరం భావించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతిఒక్కరి కర్తవ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కునగరం విద్యార్థులు, నిర్వాసిత కాలనీలు, గాజువాక నాట్య అకాడమీ విద్యార్థులు స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని వివిధ కళారూపాల ద్వారా ప్రదర్శించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు కె గంగాధర్, టివికె రాజు, బి ఎస్ మధుసూదన్, రాజా యూట్యూబ్ నిర్వాహకులు డి సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులతో పాటు స్టీల్ ప్రజానాట్యమండలి, ఉక్కు అభ్యుదయ కళావేదిక కార్యకర్తలు కె సత్యనారాయణ, కృష్ణార్జున, కె సింహాచలం, ఎం గౌరీ శంకర్, వై ఎస్ రావు, ఎస్ వెంకటేశ్వర్లు, సువర్ణ రాజు, కె అప్పారావు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టుకు ప్రతిభా అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న పోర్టు ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : మోడెమ్ పోర్టులలో ఒకటైన అదానీ గంగవరం పోర్టుకు స్వాతంత్ర్య దినోత్సవ మెరిటోరియస్ అవార్డును అందుకుంది. విశాఖ నగరంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి అదానీ గంగవరం పోర్ట్ సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం అవార్డును స్వీకరించింది. జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, జాయింట్ కమిషనర్ కె. ఫకీరప్ప, ఇతర ప్రముఖులు, జిల్లా అధికారులు సమక్షంలో అవార్డును స్వీకరించడం గౌరవం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. సమాజ సేవ పట్ల తమకున్న నిబద్ధత, అంకితభావానికి ఈ అవార్డు ద్ధం పడుతోందన్నారు. స్థానిక, జాతీయాభివృద్ధికి దోహదపడేందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

గుర్తింపు కార్డులు అందజేస్తున్న హెచ్ఎం, దాత

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం బాలుర వసతిగృహం విద్యార్థులు, హైస్కూల్ స్కౌట్ విద్యార్థులకు గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు కొట్యాడ సత్యమూర్తి ఆర్థిక సాయంతో 200 మందికి శుక్రవారం గుర్తింపు కార్డులను అందజేశారు. ఆనందపురం బిసి బాలుర హాస్టల్‌లో 148 మంది, హైస్కూల్‌లో 52మందికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రామకృష్ణ పట్నాయక్ మాట్లాడుతూ, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొట్యాడ సత్యమూర్తిని అభినందించారు. పాఠశాలలో విగ్రహంఏర్పాటు, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం, పేద విద్యార్థులకు, సేవా కార్యక్రమాలకు ఆర్థికచేయూత నివ్వడం వంటి సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. దాత సత్యమూర్తి, ఉపాధ్యాయులు భాస్కరరావు, ప్రసాద్ పాల్గొన్నారు

ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి -తగరపువలస : 2023 -24 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు గిడుతూరి శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్ సాహులతో పాటు పాఠశాల హెచ్ఎం పొట్నూరు మురళీమోహనరావును జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరింధిర ప్రసాద్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులను అభినందించడంతోపాటు హెచ్ఎంను సత్కరించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు,

బొత్సకు శుభాకాంక్షల వెల్లువ

బొత్సను అభినందిస్తున్న కెకె.రాజు, అమర్, ధర్మశ్రీ,అదీప్‌రాజ్

ప్రజాశక్తి -సీతమ్మధార: ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజు ఉన్నారు.

వేపగుంట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొత్సకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాభినందనలు తెలిపారు.

ఆనందపురం : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నికపై ఆనందపురంలో వైసిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బొత్స ఇంటికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు మజ్జి వెంకటరావు, బంటుబిల్లి మణిశంకర్‌నాయుడు, బంక సత్యం, బంక శ్రీను, పిన్నింటి వెంకటరమణ ఉన్నారు.

నక్కపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను విశాఖలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు కలిసి అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.మాజీ ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నక్కపల్లి వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యులు బచ్చల రాజు, నాయకులు లోడగల చంద్రావు, దేవుళ్ళు , నాగ అప్పలరాజు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు

బొత్సను సత్కరిస్తున్న నక్కపల్లి వైసిపి శ్రేణులు

అనకాపల్లి : స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులుగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో శుక్రవారం ఆయనను అనకాపల్లి మాజీ పార్లమెంట సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

వికసిత్ ఆంధ్ర లక్ష్యాల సాధనకు సమిష్టి కృషి

యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

వికసిత్ భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్ర-2047కు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని, ఇందుకు సంబంధించిన రాబోయే 5 సంవత్సరాల (2024-29)కు జిల్లా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధునాతన పద్ధతులు వినియోగించడం ద్వారా ఇప్పుడున్న అభివృద్ధి, ఉత్పత్తులను పెంచవచ్చని, తద్వారా ఆర్థిక ఎదుగుదల ఉంటుందని చెప్పారు. 2024-29 జిల్లా యాక్షన్ ప్లాన్ తయారీలో అధికారులు విజన్‌తో పనిచేయాలని, డాక్యుమెంట్స్ తయారు చేయడంతో పాటు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి నిర్ణీతమైన సమయంలో సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ యాక్షన్ ప్లాన్ డాక్యుమెంట్ తయారు చేసే విధానంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. చీఫ్ ప్లానింగ్ అధికారి జి.రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి, కెనరా బ్యాంకు అధికారులు

కెనరా బ్యాంకు విద్యా జ్యోతి స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కెనరా బ్యాంకు అంబేద్కర్ విద్యా జ్యోతి పథకం ద్వారా మండలంలోని రాజాం కెనరా బ్యాంకు ఆధ్వర్యాన రాజాం గ్రామానికి చెందిన ఐదుగురు దళిత విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేశారు. రాజాం హైస్కూల్‌కు చెందిన మెరిట్ విద్యార్థులు కురం కీర్తన, గాడి శాంతికుమారి, ఎలుసూరి మమత, ఎలుసూరి శిరీష, కోరిబిల్లి హేమలతలకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున కెనరా బ్యాంకు రాజాం బ్రాంచ్ మేనేజర్ మృదుల శుక్రవారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పిటిసి దొండ రాంబాబు మాట్లాడుతూ రాజాం కెనరా బ్యాంక్ ద్వారా రైతులకు రుణాల మంజూరు చేయడం పట్ల హర్షం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎల్.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

5కె వాక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ

మెగాస్టార్ చిరంజీవి జన్మదినం ఈనెల 22న జరుగనున్న నేపథ్యంలో లంకెలపాలెం చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో మెగాస్టార్ 69వ జన్మదిన వారోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మొదటి రోజు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని 5కె వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి ముందు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ చిరంజీవి అభిమానులకు చిరు ఫోటోతో ఉన్న టీ షర్టులు, టోపీలను అందజేశారు. అనంతరం లంకెలపాలెం జంక్షన్ నుండి అగనంపూడి వరకు 5కె వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు అభిమానులు అంటేనే క్రమశిక్షణతో ఉంటారని, ఈ రకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మడక రమేష్ నాయుడును అభినందించారు. ఇందల రమణ మాట్లాడుతూ మెగా ఫ్యామిలీకి ఆంధ్రాలోనే కాకుండా ప్రపంచం మొత్తం అభిమానులు ఉన్నారన్నారు. ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యారావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల చిరు గౌరవం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదాసు వాసుదేవరావు, గొల్లవిల్లి నాగరాజు, గంజి సురేష్, బంతికోరు గోవిందరాజు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, గైపూరి భాస్కరరావు, తురసాల శ్రీనివాసరావు, కల్లేపల్లి శంకర్, మేడిశెట్టి జానకిరామ్, రాఘవాపురపు శ్రీనివాస్ కుమార్, జుత్తక రాము, మడక వీరాస్వామి, కోరుకొండ అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

ఎఎంఎఎ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనకాపల్లి ఎఎంఎఎ హైస్కూల్లో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖపట్నం, అనకాపల్లి రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని వర్తక సంఘం అధ్యక్షులు తమ్మన రఘుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది పేదలకు కంటి వెలుగు ఇవ్వడంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ముందంజలో ఉందని, వారికి తమ వర్తక సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాజా ఆప్టికల్ కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజాకి ఆయన ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 282 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 62 మందికి శస్త్ర చికిత్సల అవసరమని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించామని, 45 మందికి కంటి అద్దాలు పడతాయని వారికి ప్రత్యేక రాయితీతో కళ్ళద్దాల అందజేస్తామని రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆసుపత్రి అధినేత పూసర్ల రాజా తెలిపారు. ఉచిత కంటి పరీక్షా శిబిరాలు ఏర్పాటు చేయాలంటే తమని పూసర్ల రాజా 9032223330 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు సువర్ణ, సిబ్బంది కంటి పరీక్షలను నిర్వహించారు.

వైసిపి అసత్య ప్రచారం సరికాదు

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామ పంచాయతీలకు పంద్రాగస్టు నిధులను ప్రభుత్వం భారీగా పెంచిన విషయాన్ని వైసిపి జీర్ణించుకోలేక అసత్య ప్రచారం చేస్తుందని, అది సరైన పద్ధతి కాదని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా మేజర్ పంచాయతీలకు కేవలం రూ.250, మైనర్ పంచాయతీలకు రూ.100 ఖర్చు చేసుకునే అవకాశం ఉండేదని, అవి కూడా పంచాయతీ నిధులనుండే ఖర్చు చేసుకునేవారమని తెలిపారు. వాటికోసం ప్రత్యేకంగా ఏ ప్రభుత్వమూ నిధులు విడుదల చేసేది కాదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయితీ నిధుల నుండి పెద్ద పంచాయతీ రూ.25వేలు, చిన్న పంచాయతీ రూ.10వేలు చొప్పున ఖర్చు చేయడానికి ఇటీవల జీవో విడుదల చేశారని పేర్కొన్నారు. ఇవేమీ తెలుసుకోకుండా వైసిపి సొంత పత్రికలో అసత్య కథనాలు ప్రచురించడం భావ్యం కాదన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీలను చీకట్లో నెట్టివేసిందని, బ్లీచింగ్‌కు కూడా నయా పైసా ఖర్చు చేయలేని పరిస్థితి కల్పించిందని గుర్తు చేశారు.

జిఒ కాపీని చూపుతున్న దాడి ఎరుకునాయుడు

స్కూల్ కమిటీ ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-మునగపాక : మండలంలో ఈనెల 17న జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికలకు ప్రతి ఒక్కరు సహకరించాలని స్థానిక ఎస్సై పి ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అందరి సహకారం వలన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు జరుపుకున్నామని చెప్పారు. అదేవిధంగా 17న జరగబోయే స్కూల్ కమిటీ ఎన్నికలలో కూడా ప్రజలందరూ సహకరించాలని కోరారు. 144 సెక్షన్ అమలులో ఉంటుంది, ఎన్నికలు జరుగు ప్రదేశంలో ప్రజలు ఎవరు గుమ్మిగూడి ఉండటం, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం, కవ్వింపు చర్యలకు దిగడం వంటివి చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థి తల్లిదండ్రుల్లో ఓటు హక్కు కలిగిన వారు తప్ప మిగతా ఎవరు కూడా స్కూలు ఆవరణలో కనిపించరాదని కోరారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రతి రైతూ బాధ్యతగా పంట నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసుకున్న రైతులను మాత్రమే అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మండల ప్రత్యేక అధికారి, ఏడిఏ, వి.రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని కాశీపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం ప్రకటించే నిర్దిష్ట ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. కౌలు రైతులు, డి.పట్టా, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూములు కలిగిన రైతులు కూడా పంటల నమోదుకు అర్హులేనని తెలిపారు. ప్రతి రైతూ ఏయే సర్వే నెంబర్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో, ఆ పంటలను గ్రామ రైతు సేవా కేంద్రంలో పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదును పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్

పశువుల ఆసుపత్రి భవనానికి వీడని గ్రహణం

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచని వైనం

- శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది పశువుల ఆసుపత్రికి నూతనంగా భవనం నిర్మాణం చేసినా, ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సిబ్బంది శిథిల భవనంలోనే విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. వడ్డాది పశువుల ఆసుపత్రి చాలా కాలం నుంచి శిథిలమైన భవనంలో నడుస్తోంది. పాత పెంకుల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవటంతో ఏడాది కిందట రెండు గదుల్లో ఒక గది పైకప్పు కూలిపోయింది. దీంతో మందులు, ఇతర సామాగ్రి తడిసి పాడయ్యాయి. అయినా వైద్య సిబ్బంది అదే భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. కొత్త భవన నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఆసుపత్రి సిబ్బంది పడుతున్న కష్టాలను చూడలేక స్థానిక నాయకులు, రైతులు కలిసి ఈ సమస్యను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ద్వారా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయినా గ్రహణం వీడలేదు. ఇప్పటికీ దానిని ప్రారంభించలేదు. దీంతో పాత భవనంలోనే సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. వర్షాలు పడితే భయంతో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించాలని పలువురు రైతులు, పశువైద్యశాల సిబ్బంది కోరుతున్నారు.

అడవులను అదానీకి తాకట్టు పెట్టొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనకాపల్లి, అల్లూరి జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో అదానీ హైడ్రోపవర్ ప్లాంట్‌కు ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని, అడవులను అదానీ కంపెనీకి తాకట్టు పెట్టే ప్రతిపాదనలు మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైవాడ, కోణాం రిజర్వాయర్లు, శారద, బొడ్డేరు నదీ పరివాహక ప్రాంతాలతో పాటు దట్టమైన అడవులు ఉన్న ఈ ప్రాంతాన్ని అదానీ హైడ్రోపవర్ ప్లాంట్ల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చకచకా అనుమతులు ఇచ్చేస్తున్నాయని తెలిపారు. అదే జరిగితే అదాని చేతుల్లోకి అడవులు వెళ్ళిపోతున్నాయని, గిరిజనుల బతుకులు బుగ్గిపాలవుతాయని, వన్య ప్రాణులకు, దేవరాపల్లి, అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని పలు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, కోణాం, రైవాడ ఆయకట్టు భూములు ఎడారిగా మారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులు, అదానీ ఏజెంట్లతో కలిసి సర్వేలు నిర్వహిస్తున్నారని, వారిని గిరిజనులు ఎక్కడికక్కడ అడ్డుకొని పంపించేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవంఛనీయ సంఘటనలు జరిగినా దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతామని చెప్పిన రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం దానికి తూట్లు పొడుస్తూ అదానీ కంపెనీకి అడవులను తాకట్టు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తుందని విమర్శించారు. గిరిజనులు చిన్నపాటి పోడు వ్యవసాయం చేస్తే రిజర్వు ఫారెస్టు పేరుతో కేసులు పెట్టే ప్రభుత్వం, అధికారులు, అడవులను పూర్తిగా నాశనం చేసే అదానీకి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులు ఇవ్వడమంటే పీసా, 1/70, అటవీహక్కుల చట్టం వంటి గిరిజన చట్టాలు, అటవీ, పర్యావరణ చట్టాల ధిక్కరణే అవుతుందన్నారు. అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులు నిలుపుదల చేయకపోతే ప్రత్యక్ష ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

మురికి కాలువల్లో పూడిక తీస్తున్న కార్మికులు

పూడిక తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీ కొత్తపేట వీధిలో సాయిబుల దొడ్డిలో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను శుక్రవారం తొలగించారు. ఈ ప్రాంతంలో వారం రోజులుగా మురికి నీరు రోడ్‌పైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో పూర్తిగా రాకపోకలు ఆగిపోయాయి. దీనిపై స్థానిక యువకులు పంచాయతీ సెక్రటరీ ఈశ్వరరావుకి, కొత్తపేటవీధి టిడిపి కూటమి నాయకులకు మొర పెట్టుకున్నారు. దీంతో పంచాయతీ ఈవో ఈశ్వరరావు తమ సిబ్బందితో డ్రైనేజీ పూడికలను దగ్గరుండి తొలగించారు. దీంతో రోడ్డుపై చేరిన మురుగునీరు తొలగిపోయింది. మేజర్ పంచాయతీలో మేజర్ సమస్యగా డ్రైనేజీ వ్యవస్థ మారిందని స్థానికులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో కాలువలపై నిర్మించిన మెట్లను, అరుగులను పూర్తిగా తొలగించి నూతన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి తుమ్మపాల వాసులకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని కూటమి నాయకులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం కలెక్టర్ విజయకృష్ణన్ సందర్శించారు. ఆమెకు కళాశాల ప్రధానాచార్యులు ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఐఓటి ప్రయోగశాలను పరిశీలించారు. కళాశాల ప్రగతిని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు వివరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ప్రాంతానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాలిటెక్నిక్ విద్యతో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి రామారావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు శుక్రవారం నల్లాం శ్రీరామ్ ఆర్గనైజేషన్ తరుపున ఆరు కంప్యూటర్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లను అందజేశారు. ఇందులో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో 6 డెస్క్‌టాప్ కంప్యూటర్లను ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లకు అందించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కర్రి గంగాధర్ ప్రారంభించారు. సెకండ్ ఫేజ్‌లో మరికొన్ని కంప్యూటర్లు అందజేస్తామని సంస్థ హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు అంతంత మాత్రమే ఉన్నాయని, ఇలా దోనర్లు ఎవరైనా ముందుకొస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు విద్యార్థులకు అందుబాటులో తీసుకొచ్చి ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహేంద్ర పట్నాయక్, గోవింద్, రామరాజు, ప్రియాంక, కమల, రత్నం, నాగమణి, మోతి, రేష్మ, సుభాషిణి, కంప్యూటర్ ఫ్యాకల్టీ త్రినాథ్, రమణ, నాయుడు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - యలమంచిలి

కోతలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని టిడిపి కూటమి ప్రభుత్వ హామీ ఇచ్చినప్పటికీ యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం జరుగుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇందులో తమ లోపం లేదంటూ విద్యుత్ అధికార్లు చెప్పుకొస్తున్నారు. ఉదయం మొదలుకొని 6, 9, 12, మధ్యాహ్నం 2, 4, 6 గంటలు ఇలాంటి ముఖ్యమైన సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోందని పట్టణ వాసులు వాపోతున్నారు. దీంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 33 కెవి సబ్ స్టేషన్లలో వచ్చే లోవోల్టేజి సమస్య కెపాసిటర్ బాక్స్ ఉపయోగించి పరిష్కరించినట్లు చెప్పినప్పటికీ దాంట్లో ఫలితం కనిపించలేదు. అంతరాయం విషయంలో డిస్కంలు రోజువారీ సమీక్షలు జరుపుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల అధికారులు, వినియోగదారులూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై **ఎలక్ట్రికల్ ఎఇ కనకరాజును వివరణ కోరగా** శుక్రవారం నుండి వేరే లైన్ ద్వారా యలమంచిలి మున్సిపాలిటీకి విద్యుత్ సరఫరా చేస్తామని, ఇక నుండి విద్యుత్ అంతరాయానికి తావులేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ఇంద్రగంటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దాడి రత్నాకర్

జిల్లా టూరిజం కౌన్సిల్ సభ్యునిగా సంగీత దర్శకుడు ఇంద్రగంటి నియామకం

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లా టూరిజం కౌన్సిల్ సభ్యునిగా అనకాపల్లికి చెందిన కళ్యాణి నృత్య సంగీత అకాడమీ వ్యవస్థాపకులు, నృత్య దర్శకులు ఇంద్రగంటి లక్ష్మి శ్రీనివాస్‌ను నియమిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తన కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ఇటువంటి పదవులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. తన ఉన్నతికి కారకులైన దాడి కుటుంబ సభ్యులను, అభిమానులను మరువలేనని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు వెడల్పు చేశారు.. విద్యుత్ స్తంభం మరిచారు

రహదారికి మధ్యలోనే కరెంట్ పోల్ ఉండిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి పనులు జరిగినా వాటి వల్ల వేరే సమస్యలు ఉత్పన్నమవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపాలిటీవారు పైనున్న కరెంటు తీగలు చూడకుండా రోడ్డు పక్కన మొక్కలు నాటుకుంటూ పోతారు. మొక్కలు చెట్లయ్యాక వైర్లకు అవి తగులుతున్నాయని విద్యుత్ శాఖ వారు వాటిని నరుక్కుంటూ పోతారు. ఇలాగే మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు వెడల్పు జరగ్గా, రహదారి మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. సంస్థ ప్లానింగ్‌లోనే సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోకపోవడమే ఇందుకు కారణం.

కొద్ది రోజుల క్రితం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి రైల్వే స్టేషన్‌రోడ్డును వెడల్పు చేశారు. రూ.2.30కోట్లతో ఒన్‌వే రోడ్డు వేశారు. బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఉడా ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు వేశారు. ఈ మార్గంలో ప్రయాణానికి అడ్డంగా ఓ విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉండిపోయింది. రోడ్డు వెడల్పు చేశారు గాని విద్యుత్ స్తంభాన్ని స్థాన చలనం చేయడం మర్చిపోయారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. హడావిడిగా వచ్చే వాహనదారులు విద్యుత్ స్తంభాన్ని గమనించకపోతే పెద్ద ప్రమాదమే జరుగుతుందని ప్రయాణికులు భయపడుతున్నారు.

విద్యుత్ అధికారుల వివరణ

దీనిపై విద్యుత్‌శాఖ అధికారులను వివరణ కోరగా, రోడ్డు వెడల్పు చేసే సమయంలో రహదారి మధ్యలో ఉండే విద్యుత్ స్తంభాన్ని పక్కకు షిఫ్ట్ చేయాలని తమ శాఖకు దరఖాస్తు చేస్తే, స్తంభం షిఫ్టింగ్ చార్జీ చెల్లించిన తర్వాత స్తంభాన్ని మారుస్తామని చెప్పారు. సాధారణంగా ఇదంతా రోడ్డు వేయడానికి ముందు జరగాల్సిన తతంగం. కాని అలా జరగలేదని తెలిపారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

డ్రెయినేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, పంచాయతీ కార్యదర్శి జీనబంధు పర్యవేక్షణలో పూడికపోయిన మురుగు కాలువలను శుభ్రపరిచారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు మట్టి తదితర వాటిని తీసివేశారు.

కెజిబివికి వాటర్ డిస్పెన్సర్ వితరణ

ప్రజాశక్తి - సబ్బవరం

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని సబ్బవరం గ్రామానికి చెందిన శ్రీసూర్య మెడికల్ షాప్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ వాటర్ డిస్పెన్సర్‌ను వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ సర్పంచ్ దేడ్డం ప్రసాద్, బాదిరెడ్డి లక్ష్మణ ప్రిన్సిపాల్ మృదులకు అందజేశారు. బాదిరెడ్డి లక్ష్మణకు కెజిబీవీ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సింహాలు (వీధి కుక్కలు) స్వైర విహారం చేస్తున్నాయి. అన్ని గ్రామాల్లో వీధి కుక్కలు పెరిగిపోయాయి. ఎక్కడబడితే అక్కడ వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎలా దాడి చేసి గాయపరుస్తాయోనని ప్రజలు హడలిపోతున్నారు. కుక్కలు గుంపులు చేరి ఒకేసారి పరుగులు తీయడంతో ఆదమరిచి ఉన్న జనం పలు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలో కుక్కల బెడద మరి ఎక్కువైంది. వీటిని నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దేవరాపల్లిలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

వాటర్ డిస్పెన్సర్లు అందిస్తున్న లక్ష్మణ్ తదితరులు

అధ్వానంగా చౌడవాడ రహదారి

-అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు-ఎన్నిసార్లు మొరపెట్టుకన్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో చౌడవాడ గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు, వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి సమస్యపై గ్రామస్తులు, నాయకులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరు పట్టించుకోలేదు. గ్రామమంతా ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.విశాఖకు, అనకాపల్లికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో ఈ రహదారి నిత్యం రద్దీగానే ఉంటుందని, వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉపమాకలో గోదాదేవి తిరువీధి సేవ

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో గోదాదేవి అమ్మవారి తిరు వీధి సేవ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను ఉపమాకలో తిరువీధి సేవ నిర్వహించారు .పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో ఆలయ అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మహేష్ భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి ,భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

హోం మంత్రి అనిత ఇంట వరలక్ష్మీ వ్రతం

నక్కపల్లి:నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత స్వగృహంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు .శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని అనిత తో పాటు కుటుంబ సభ్యులు వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు .వేద పండితులు వ్రత పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

వరలక్ష్మి వ్రతం కు హోంమంత్రి అనిత పలువురు మహిళలను ఆహ్వానించారు.

కొత్తకోట:రావికమతం మండలంలో శ్రావణమాసం శోభ కన్నుల పండువగా సాగింది. దుర్గా దేవి ఆలయాలు మహిళా భక్తులతో కిట కిట లాడాయి. శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే రెండవ శుక్రవారం ప్రతి ఇంట వరలక్ష్మి దేవి పూజ కార్యక్రమం కుటుంబ సమేతంగా జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. కొత్తకోట, రావికమతం దుర్గాదేవి, చినపాశీలలో శ్రీ వైష్ణవిదేవి ఆలయంలో పూజలు చేశారు. గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది.

గొలుగొండ:శ్రావణ రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను గొలుగొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణదేవిపేట కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మండల వ్యాప్తంగా ఉన్న పలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లిలో జ్ఞాన సరస్వతి మాత దేవాలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో వ్రతాలు, పూజలు నిర్వహించారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు చిట్టి మోజు శివరామకృష్ణ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి వారం వరలక్ష్మి వ్రతాలు పూజలు నిర్వహిస్తామని, సుమారు 2000 మందికి అన్నదానం చేస్తామని తెలిపారు.

కె.కోటపాడు :శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం పూజలు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శక్తి కొలది కొందరు బంగారు ప్రతిమలు, వివిధ రకాల పిండి వంటలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలోని పార్వతి దేవికి అధిక సంఖ్యలో మహిళలు పూజలు నిర్వహించారు.

కశింకోట : శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మి పూజలు జరిగాయి. వరలక్ష్మి పూజలు నిర్వహించి చేతులకు పసుపుకొమ్ము పూవులు కట్టుకొన్నారు. సమీపంలోని ఆలయాలను దర్శించుకున్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూజ సామాగ్రి, పువ్వులు, పండ్లు, స్వీట్లు ధరలు పెరిగాయి.

మాడుగులలో అన్న సమారాధన

మాడుగుల: మాడుగులలో శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీ దేవి ఆలయంలో ప్రముఖ న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

కుటుంబ సమేతంగా భోజనం చేస్తున్న అయ్యన్న

వెంకన్నను దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వరస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్నదాన సత్రంలో భార్య పద్మావతి, కుమారులు చింతకాయల విజయ్, రాజేష్, కోడళ్ల సువర్ణ, దివ్యలతో కలిసి భోజనం చేశారు.

మాట్లాడుతున్న రాజు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కొత్తకోట:జనసేన పార్టీ "లక్ష్యం – ప్రజా క్షేమం " కార్యక్రమాన్ని రావి కమతం మండలం కొత్తకోట లో చోడవరం జనసేన ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు శుక్రవారం ప్రారంభిం చారు.. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో పివి ఎస్ఎన్ రాజు మాట్లా డుతూ, నియో జక వర్గంలోని గ్రామాలలో సమస్యలు పరిష్కారం చాలన్న సంకల్పంతో ఈ నూతన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు వివరించడం జరుగు తుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు దాసరి చిన్నబ్బాయి, చింతల కిషోర్, లొట్ల శివ, కోన రమణ, శీలం గౌతమ్, రాజా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న నాయకులు

కార్మికులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -ఎలమంచిలి:చిన్న వాల్తేరు మహమ్మ దీయ మసీదు యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, తూర్పు నియోజకవర్గ మైనార్టీ ప్రెసిడెంట్ మహమ్మద్ రహమతుల్లా (మైనార్టీ సెల్ సెక్రెటరీ) చేతుల మీదుగా నిరుపేద కార్మికులకు ప్రతి ఒక్కరికి ఐదు కేజీలు చొప్పున బియ్యం అందజేశారు. మహమ్మదీయ మసీదు యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు ప్రతినెలా నిత్యావసర సరుకులు ఉచితంగా ఇస్తున్నారు. మైనార్టీ సభ్యులు, చిన్న వాల్తేర్ మసీద్ యూత్ కమిటీ సభ్యులు ఖాదర్, రఫీ, షఫీకి నజీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు స్కూల్ కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో ఈనెల 17న శనివారం జరగనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

పాఠశాల వద్ద పోలీసులు

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాధారణ వాతావరణం కొనసాగింది. ఆ తర్వాత నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణంలోని మార్పులు చేసుకున్నాయి. దీంతో, కారు మబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా భారీ వర్షం మొదలైంది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి.సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయం కాగా పంట పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక అవస్థలు పడ్డారు.

కురుస్తున్న వర్షం

చిరు జన్మదినాన మెగా 5కె వాక్

ప్రజాశక్తి- గాజువాక : ఈనెల 22న చిరంజీవి 69వ జన్మదిన సందర్భంగా లంకెలపాలెం చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు శుక్రవారం లంకెలపాలెం జంక్షన్ నుండి అగనంపూడి వరకు 5కె వాక్‌ను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించి, చివరి వరకు అభిమానులతో కలిసి వాక్ చేశారు. ఆ సందర్భంగా చిరు ఫోటోతో ఉన్న టీ షర్టులు, టోపీలను చిరంజీవి అభిమానులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు జన్మదిన వారోత్సవాల్లో అభిమానులు తనను భాగస్వామ్యం చేయడంపై ఆనందం వ్యక్తంచేసి, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యారావు, జుత్తక రాము, మడక వీరాస్వామి, కోరుకొండ అప్పారావు పాల్గొన్నారు. .

5కె వాక్ ప్రారంభిస్తున్న శ్రీనివాస్

మధ్యవర్తిత్వంతో వ్యాజ్యాల సత్వర పరిష్కారం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

జ్యోతిప్రజ్వలన చేస్తున్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : న్యాయస్థానాలలో వాజ్యాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి అన్నారు. శుక్రవారం సాయంత్రం 'మీడియేషన్ ఎజ్ ఎన్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ ప్రోసెస్' అనే అంశంపై ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో ఏయూ న్యాయ కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి మధ్యవర్తిత్వానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కార్మిక చట్టాలలో మధ్యవర్తిత్వం వినియోగించే విధానాన్ని వివరించారు.. తాను న్యాయవాద వృత్తిలో అడుగిడిన తొలినాళ్ళలో కుటుంబ వివాదాల వాజ్యాల సంఖ్య పరిమితంగా ఉండేదని, నేడు వేలకు చేరుకుందన్నారు. మధ్యవర్తిత్వంతో న్యాయస్థానాలకు వచ్చే విభిన్న వాజ్యాలను .సమర్థవంతంగా, వేగవంతంగా పరిష్కరించవచ్చన్నారు. 2023లో వచ్చిన మీడియేషన్ చట్టంలో గోప్యత, శిక్షణ, కాలం, సకాలంలో పరిష్కారం చూపడం అనే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. వివాదంలో ఉన్న రెండు పార్టీలు తమ జ్ఞానాన్ని వినియోగిస్తే మధ్యవర్తిత్వంద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు మధ్యవర్తిత్వం వలన న్యాయవాదులకు, వృత్తికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. దీనిపై న్యాయవాదులు ఎటువంటి అపోహలు, భయపడాల్సిన అవసరం లేదన్నారు.భవిష్యత్ న్యాయవాదులుగా మారే నేటి యువ విద్యార్థులు చదవడం, రాయడం, చర్చించడం, ఆలోచన చేయడం, అవగాహన చేసుకోవడం అనే ఐదు అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తన జీవితంలో విద్యార్థి దశలో జరిగిన పలు సంఘటనలు వివరిస్తూ తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన విధానం తెలియజేశారు.

ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ దేశానికి అవసరమైన న్యాయమూర్తులను, న్యాయ నిపుణులను, సమాజానికి ఉపయుక్తంగా ఎందరో నాయకులను అందించిన విధానం వివరించారు ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సభకు జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరిని పరిచయం చేశారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, ఏపి హైకోర్టు న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన అందించిన సేవలను విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. అనంతరం వర్సిటీ తపున జస్టిస్ మహేశ్వరిని సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల ఆవరణలో జస్టిస్ మహేశ్వరి మొక్కను నాటారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా న్యాయస్థానం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఉపాధ్యక్షుడు క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశ రావు, పలువురు న్యాయమూర్తులు, మాజీ ఉపకులపతులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతిని ఇస్తున్న హెచ్ఎం

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట:గత మార్చి లో జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎక్కల దేవి చెల్లయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరిదేశీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కొత్తకోట పి యస్ ఆర్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రతి ఏటా పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థు లను ఎంపిక చేసి గత ఆరేళ్లు గా ఫౌండేషన్ సభ్యులు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా ప్రథమ, ద్వితీయ స్థానాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.4వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని హెచ్ఎం నాగేశ్వరరావు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, డి సి ఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, జనసేన ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు, టిడిపి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు కోట నీలవేణి పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎక్కల దేవి పరిదేశీని ఘనంగా సన్మానించారు.

స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి–విశాఖ కలెక్టరేట్:ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షులు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో లెబెన్‌షిల్ఫ్ మానసిక వికలాంగుల పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ మాట్లాడుతూ, కేజ్రీవాల్‌ను అన్యాయంగా అక్రమ అరెస్ట్‌తో జైలులో పెట్టారన్నారు. కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్ నుండి విడుదల చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదరాజ సాంచి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శీతల్ మదన్, రాష్ట్ర ఐటీ, సోషల్ మీడియా ఇంచార్జి బి.వి.ఆర్ పవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ధనలకోటి రమణ, కెఎం రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి

- ఎస్‌పి దీపిక - పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్‌పి దీపిక శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని ఆదేశించారు. నేషనల్ హైవేలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీ పై పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక/ డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు..తరుచు రిపోర్ట్ అవుతున్న నేరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు.

రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎస్‌పి వెంట నర్సీపట్నం సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ బి.అప్పారావు, పాయకరావుపేట సిఐ పి.అప్పలరాజు, ఎస్సై బి.జోగారావు, తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యాన

18,19 తేదీల్లో మెగా ఫొటో ప్రదర్శన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా వాల్తేరు ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 18,19 తేదీలలో రెండు రోజులు ఆంధ్ర యూనివర్సిటీ, హిందీ విభాగం,సెమినార్ హాల్‌లో ఫోటో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఫోటోగ్రఫీ సొసైటీ కార్యదర్శి, సీనియర్ ఫోటోజర్నలిస్ట్ ఎం. వి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. 18వ తేదీ ఉదయం 9.30 గంటలకు విజయ మెడికల్ సెంటర్ అధినేత సుమన్ కలగర ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా వల్లా రాజారావు లైఫ్ టైమ్ అచీవమెంట్ అవార్డు, సీనియర్ ఫోటోజర్నలిస్ట్, సి.హెచ్. సత్యనారాయణ కు బండి వెంకటరమణ రావు మెమోరియల్ అవార్డు, సీనియర్ ఫోటోగ్రాఫర్ సత్యారావు బాబ్జి కి ప్రదానం చేస్తారు. ఈ ప్రదర్శనలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొంటారు. నేచర్, వైల్డ్‌లైఫ్, ల్యాండ్ స్కేప్, పిక్టోరియల్, ఫోటోజర్నలిజం అంశాలపై ప్రదర్శన ఉంటుంది. ఈ ఫోటో ప్రదర్శన తో పాటు పురాతన కెమెరాలు ప్రదర్శనలో ఉంచుతారు.

అధికారులకు ఉత్తమ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.కళ్యాణి ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో గురువారం ఉత్తమ పురస్కారాలను అందజేశారు. దీనిలో భాగంగా ఔషధ నియంత్రణ శాఖలో పాడేరు, నర్సీపట్నం జోన్ పరిధిలో ఉత్తమ ప్రతిభతో విశేష సేవలు అందజేసిన కళ్యాణికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈమె పాడేరు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుండి నర్సీపట్నం ఇన్‌చార్జ్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా పాడేరు, నర్సీపట్నం జోన్ పరిధిలో ఉన్న డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధులు సహా హోల్ సేల్ రిటైల్ మందుల షాపుల యాజమానులు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉత్తమ పురస్కార గ్రహీత కళ్యాణికి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

భీమునిపట్నం : జిల్లాస్థాయిలో ఉత్తమ సేవలకు గాను డివిఎల్‌డిఒ బి.లక్ష్మీపతికి స్వాతంత్ర్య దినోత్సవ ప్రతిభా పురస్కారం లభించింది. విశాఖ నగరంలోని పోలీసు బ్యారెక్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన జెండావందన వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కళ్యాణి

గాజువాక:స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖలో నిర్వహించిన వేడుకల్లో..గాజువాక జోన్ గొంతినపాలెం సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పిన్నింటి అనిల్ ప్రకాష్‌కు ప్రతిభా పురస్కారం దక్కింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా అనిల్ ప్రకాష్‌ను తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

పురస్కారాన్ని అందుకుంటున్న డివిఎల్‌పిఒ